సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 6 | మే | 2023



భూసేకరణను పర్యవేక్షించాలి

భూసేకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించా లని కలెక్టర్ అనుదీప్ పేర్కొన్నారు. ఐడీఓసీలో జరిపిన సమీక్షలో మాట్లాడారు. 8లో



పెంపు సరే.. ఇవ్వడం ఎలా..?

మేడే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెంచింది. ఆ భారం పంచాయతీలపై మోపింది. 10లో

గరిష్టం / కనిష్టం
36° / 26°

వాతావరణం

జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఎండ తీవ్రత తక్కువగానే ఉండవచ్చు. ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచల శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలో మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు గావించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం జరిపారు. తొలుత అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చనలు నిర్వహించారు. కాగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

వైభవంగా చండీహోమం

పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయ ప్రాంగణంలోని శుక్రవారం చండీహోమం నిర్వహించారు. మండపారాధన, గణపతి పూజలు పూర్ణాహుతి కార్యక్రమాన్ని జరిపారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న 18 మంది భక్త దంపతులకు అమ్మవారి శేషవస్త్రప్రసాదాలను అందజేశారు. పూజా కార్యక్రమాల్లో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు పురాణం రవి కుమార్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మ, నర్సింహామూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

8న ఇంటర్వ్యూలు

ఇల్లెందు/భద్రాచలంఅర్బన్: ఈఎంఆర్ఐ సంస్థలో ఉద్యోగనియామకాలు చేపట్టనున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెప్టెన్(డ్రైవర్) పోస్టుల భర్తీకి ఈ నెల 8న దరఖాస్తుల స్వీకరణతోపాటు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందని, భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఉదయం పది గంటలకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 91210 03246లో సంప్రదించాలని సూచించారు.

జేపీఎస్‌ల సమ్మెకు సంఘీభావం



జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు తెలిపి భోజనాలు వడ్డిస్తున్న జెడ్పీ చైర్మన్ కనకయ్య

చుంచుపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు శుక్రవారం ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట వారి సమ్మె శిబిరాన్ని వివిధ పార్టీల నాయకులతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని అన్నారు. పల్లెలు ప్రగతిబాట పట్టి అవార్డులు సాధించడం వెనక వీరి కృషి ఉందన్నారు. అనంతరం కార్యదర్శులకు ఆయన భోజనం సమకూర్చి వడ్డించారు. అలాగే, టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరు మధు, ఇష్టా నాయకుడు సారంగపాణి తదితరులు సైతం జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు తెలిపారు.

ప్రభుత్వ భూములపై పట్టింపేది..?

పరిశ్రమల పేరుతో వందల ఎకరాలు ధారాదత్తం

- దశాబ్దాలు గడిచినా ప్రారంభంకాని పరిశ్రమలు
- వెనక్కి తీసుకోవడంలో టీఎస్ఐఐసీ నిర్లక్ష్యం
- పక్క జాగాలో కూడా పాగా వేస్తున్న బడాబాబులు



పాల్వంచ పట్టణంలో జెన్‌కో కాలనీ పక్కన పరిశ్రమల కోసం కేటాయించిన 14 ఎకరాల స్థలం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(టీఎస్ఐఐసీ) భూములు బడాబాబుల కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయి. పరిశ్రమల స్థాపన పేరుతో కొందరు ఎకరాలకు ఎకరాలు తీసుకున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా ఎక్కడా చిన్న పాటి పరిశ్రమ పెట్టిన దాఖలాలు లేవు. ఇలాంటి భూములను స్వాధీనం చేసుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

కదలని టీఎస్ఐఐసీ

స్థానికంగా ఉన్న సహజ వనరులు ఉపయోగించుకుంటూ పరిశ్రమలు స్థాపిస్తే స్థానిక యువతకు ఉపాధి లభించడంతోపాటు ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం వస్తుంది. దీంతో పరిశ్రమలకు అనుకూలంగా ఉన్న ప్రాంతంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు అందించేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా ఉంటాయి. ఇందు కోసం ప్రత్యేకంగా ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్లు సైతం ఏర్పాటయ్యాయి. జిల్లావ్యాప్తంగా పరిశ్రమలకు అనుకూలంగా ప్రాంతాలను గుర్తించడం, పరిశ్రమలకు అనువైన మౌలిక సదుపాయాలు కల్పించడం, అవసరమైన చోట ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి పారిశ్రామికవేత్తలకు స్థలాలను కేటాయించడం ఈ సంస్థ ప్రధాన విధులు. జిల్లాలో సహజ వనరులు, మానవ వనరులు పుష్కలంగా ఉన్నా ప్రైవేట్ సంస్థల స్థాపనలో టీఎస్ఐఐసీ నిరాశపూరిత ఫలి తాలు సాధిస్తోంది. దీనికి తో డు కనీసం తనకు సంబంధించిన భూములు ఏమయ్యా యో కూడా తెలుసుకోలేనంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

కాగితాలపై లెక్కలు చూపెట్టి..

జిల్లా సహజ వనరులకు ప్రసిద్ధి. గోదావరి, కిన్నెరసాని వంటి నదులు, సింగరేణి బొగ్గు గనులు ఈ ప్రాంతం సొంతం. పైగా కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ ఏర్పాటైన తర్వాత పాల్వంచ కేంద్రంగా పారిశ్రామిక రంగం ఊపందుకుంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో అనేక పరిశ్రమలు వచ్చాయి. ఈక్రమంలో తెలంగాణ ఏర్పాటుకు ముందు పాల్వంచ పట్టణ పరిధిలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామంటూ అనేక మంది ఆసక్తి చూపించారు. దీంతో వీరికి స్థలాలు కేటాయించేందుకు అప్పటి ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇదే అదనుగా రాజకీయనాయకుల బినామీలు పారిశ్రామికవేత్తలుగా రంగంలోకి దిగారు. కాగితాలపై కాకి లెక్కలు చూపె డుతూ వందలాది ఎకరాలు దక్కించుకున్నారు.

బినామీల పేరిట రాజకీయ నాయకులకు...

పరిశ్రమల ఏర్పాటు పేరుతో వందలాది ఎకరాలను రాజకీయ నాయకులకు వారి బినామీల పేరిట పదేళ్ల కిందట పంపకాలు చేశారు. ఇలా కేటాయించిన స్థలాల్లో దశాబ్దాలు గడుస్తున్నా పరిశ్రమ కాదు కదా కనీసం శంకుస్థాపన కూడా జరగనవి ఎన్నో ఉన్నాయి. పరిశ్రమల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి భూమి సేకరించిన సందర్భంలో నాలుగేళ్లలో ఆ పరిశ్రమను ఆ స్థలంలో స్థాపించి ఉత్పత్తి చేపట్టాల్సి ఉంటుంది. లేనిపక్షంలో సదరు స్థలాన్ని ఆయా కంపెనీల నుంచి వెనక్కి తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఖరీదైన స్థలాలు నిరుపయోగంగా పడి ఉన్నా వాటిని స్వాధీనం చేసుకోవడంలో జిల్లా యంత్రాంగం, టీఎస్ఐఐసీ కనీస పట్టింపు లేనట్టుగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ, పరిశ్రమల శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఆసరాగా చేసుకుని పరిశ్రమలు స్థాపించకపోవడమే కాకుండా పరిశ్రమల పేరుతో భూములు తీసుకుని దానికి పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలను సైతం హాంఫట్‌మనిపిస్తున్నారు. వీటిపై విచారణ జరిగితే అసలు నిజాలు నిగ్గుతేలే అవకాశం ఉంది.

మచ్చుకు కొన్ని..

- పాల్వంచ పట్టణంలో సుమారు 36ఎకరాల వరకు భూములను దశాబ్దాల క్రితం పరిశ్రమలను స్థాపిస్తామని చెప్పి ఓ మాజీ కేంద్ర మంత్రి బినామీ పేరుతో తీసుకున్నారు. స్థలాలు తీసుకునే సమయంలో పరిశ్రమ స్థాపన కోసం 22 ఎకరాల స్థలాన్ని ప్రియదర్శిని కాలనీ తీసుకున్నారు. ఇందులో పనిచేసే కార్మికులకు క్వార్టర్లు నిర్మించి ఇస్తామని చెప్పి భద్రాచలం రోడ్డులో మరో 14ఎకరాల స్థలాన్ని తీసుకున్నారు. దశాబ్దాలు గడిచినా ఇప్పటి వరకు ఫ్యాక్టరీ శంకుస్థాపన కూడా జరగలేదు.
- పాల్వంచ పట్టణంలోని 444 సర్వే నంబర్‌లో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ పేరుతో అనేక మందికి ప్రభుత్వం స్థలాలు కేటాయించింది. ఇందులో శ్యాంప్రసాద్ పేరుతో ఐదు ఎకరాలు, వెంకటేశ్వరరావు పేరుతో ఐదు ఎకరాలు, కృష్ణ పేరుతో ఐదు ఎకరాల చొప్పున భూములు తీసుకున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ భూముల్లో కుటీర పరిశ్రమలు పెట్టిన దాఖలాలు ఎక్కడా లేవు. నామమాత్రంగా కూడా ఇక్కడ ఎలాంటి సూక్ష్మ పరిశ్రమ నిర్వహించలేదని స్థానికులు అంటున్నారు.
- కొత్తగూడెంలో కిన్నెర స్టీల్స్, బేరింగ్ కెమికల్స్ ఫ్యాక్టరీల పేరుతో భూములు తీసుకున్నారు. కానీ ఇప్పటివరకు ఏర్పాటు కాలేదు.

8 నెలలుగా ఎదురుచూపులే..

- ఆసరా పింఛన్ కోసం అర్హుల నిరీక్షణ
- వెబ్‌సైట్ మూసివేతతో దరఖాస్తుదారుల పాట్లు
- నిత్యం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



ఆసరా పింఛన్ కోసం దరఖాస్తు సమర్పిస్తున్న అర్హులు (ఫైల్)

చుంచుపల్లి: ఆసరా పథకం కోసం అర్హులు ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్ అర్హత వయసును 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లాలో అర్హులైనవారి నుంచి దరఖాస్తులను స్వీకరించి 2022 అక్టోబర్‌లో కొత్త ఆసరా పెన్షన్లను మంజూరు చేశారు. ఆ సమయంలో కొందరి దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. మరికొందరు సకాలంలో దరఖాస్తు చేసుకోలేకపోవడంతో అవకాశం కోల్పోయారు. దీంతో మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు గతేడాది ఆగస్టు 31 నుంచి అవకాశం కల్పించారు. ఈ సమాచారం అర్హులకు పూర్తిస్థాయిలో చేరలేదు. సెప్టెంబర్ 1 తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరించే వెబ్‌సైట్‌ను ప్రభుత్వం మూసివేసింది. దీంతో పలువురు అర్హులు మళ్లీ కొత్తగా దరఖాస్తులను సమర్పించలేకపోయారు. చేసేదేమీ లేక గ్రామ కార్యదర్శి ద్వారా మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేశారు. అప్పటినుంచి ఆసరా పథకం వెబ్‌సైట్ అందుబాటులోకి రాకపోవడంతో ఆశావాహులు ఎదురు చూస్తున్నారు. కొందరు పంచాయతీ, తహసీల్దార్, ఎంపీడీఓ, మీ సేవ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

మరో 10 వేల మంది అర్హులు

రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పథకం కింద దివ్యాంగులకు రూ.3,016 వృద్ధులు, వితంతువు, ఒంటరి మహిళలు, చేనేత, బీడీ కార్మికులు, బోదకాలు, ఎయిడ్స్, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు రూ.2,016 చొప్పున పింఛన్ అందజేస్తోంది. చివరిసారిగా 2021లో దరఖాస్తుల స్వీకరించి 2022 అక్టోబర్‌లో పింఛన్లు మంజూరు చేసింది. ఆ సమయంలో జిల్లాలో 33,663 మంది దరఖాస్తు చేసుకోగా, 26,351 మందికి మాత్రమే మంజూరైంది. ప్రస్తుతం జిల్లాలో 1,19,716 మంది ఆసరా లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో వృద్ధులు 46,747, దివ్యాంగులు 13,825, వితంతువులు 51,151, ఒంటరి మహిళలు 6,281, ఏఆర్‌టీ బాధితులు 1,241, ఫైలేరియా బాధితులు 179, డయాలసిస్ బాధితులు 121, గీత కార్మికులు 150, మంది, చేనేత కార్మికులు 17 మంది, బీడీ కార్మికులు నలుగురు చొప్పున ఉన్నారు. వీరికి ప్రభుత్వం ప్రతి నెలా రూ. 26.27 కోట్లను పింఛన్ల రూపంలో మంజూరు చేస్తుంది. ఇక గతేడాదికి 57 ఏళ్లు నిండిన వారితో పాటు గతంలో దరఖాస్తు చేసుకున్నా తిరస్కరణకు గురైనవారు కలిపి మరో 10 వేల మంది వరకు అర్హులు ఉంటారని అంచనా. వీరికి ఆసరా వెబ్‌సైట్ తెరుచుకుంటేనే తప్ప దరఖాస్తు చేసుకునే వీలుండదు.

వెబ్‌సైట్ మూసేశారు..



నేను చుంచుపల్లి హౌసింగ్ బోర్డులో నివసిస్తాను. 2019లో వితంతువు పింఛన్ కోసం దరఖాస్తు చేశాను. గతేడాది పింఛన్లు మంజూరైనా జాబితాలో నా పేరు రాలేదు. మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు గతేడాది సెప్టెంబర్‌లో మీ సేవ కేంద్రానికి వెళ్లగా అప్పటికే వెబ్‌సైట్ మూసేసి ఉంది. దీంతో ఎంపీడీఓ ఆఫీసులో దరఖాస్తు ఇచ్చాను. ఎనిమిది నెలలుగా ఎదురుచూపులు తప్పడం లేదు.

–నిమ్మటూరి కృష్ణవేణి, దరఖాస్తుదారు

ఆదేశాలు రాగానే స్వీకరిస్తాం



గతేడాది ఆగస్టు వరకు కొత్తగా ఆసరా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను చేపట్టాం. సెప్టెంబర్ నుంచి ప్రభుత్వ సైట్ తెరుచుకోకపోవడంతో దరఖాస్తులు స్వీకరించడం లేదు. కొందరు ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తులను ఇచ్చి వెళ్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే దరఖాస్తులను వెబ్‌సైట్‌లో నమోదు చేసి పెన్షన్ మంజూరు ప్రక్రియ చేపడతాం.

– జి.మధుసూదన్‌రాజు, డీఆర్డీఓ

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండలంలో శుక్రవారం సాయంత్రం రెండు గంటలపాటు కుండపోత వర్షం కురిసింది. అబ్బుగూడెం, గుంపెన, రాజాపురం, ఊటుపల్లి తదితర గ్రామాల్లోని కేంద్రాల్లో వర్షపు నీరు చేరి ధాన్యం తడిసిపోయింది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యంపై కప్పినప్పటికీ స్వల్పంగా నీరు చేరింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంటా వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించాలని అధికారులను కోరుతున్నారు.



అబ్బుగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రంలోకి చేరిన వర్షపు నీరు

తీరనున్న గిరిజనుల కష్టాలు

- రూ.12 కోట్లతో రెండు వంతెనల నిర్మాణం
- 8న మంత్రి పువ్వాడ, విప్ రేగా శంకుస్థాపన
- 25 గిరిజన గ్రామాలకు రాకపోకలు సులువు



గొందిగూడెంలో ఇసుకవాగుపై వంతెన నిర్మించేది ఈ ప్రదేశంలోనే

అశ్వాపురం: ఆ గిరిజనులు ఏటా వర్షాకాలంలో మూడునెలలపాటు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గర్భిణులు, అత్యవసర పరిస్థితి ఉన్న వారు సకాలంలో చికిత్స అందక, వాగు ప్రవాహంలో కొట్టుకుపోయి పలువురు మృత్యువాత పడ్డారు. వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా మొరపెట్టుకోగా.. ఎట్టకేలకు ప్రభుత్వం ఇసుకవాగు, లోతువాగుపై వంతెనలు మంజూరు చేసింది. దీంతో 25 గ్రామాల గిరిజనుల కష్టాలు తీరనున్నాయి. మండల పరిధిలోని గొందిగూడెంలో ప్రమాదకరమైన ఇసుక వాగుపై వంతెన నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.7 కోట్లు, తుమ్మలచెరువులో లోతువాగుపై వంతెనకు డీఎంఎఫ్ నిధులు రూ.5 కోట్లు మంజూరయ్యాయి. నిర్మాణాలకు సంబంధించి టెండర్లు పూర్తవగా ఈ నెల 8న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు శంకుస్థాపన చేయనున్నారు. ఇసుకవాగుపై హైలెవల్ వంతెన లేక వర్షాకాలంలో వాగు ఉప్పొంగి గొందిగూడెం, గొందిగూడెం కొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతులగూడెం గ్రామ పంచాయతీల్లోని 15 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. లోతువాగుపై వంతెన లేకపోవడంతో తుమ్మలచెరువు, వెంకటాపురం పంచాయతీల పరిధిలో 10 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచి గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో సకాలంలో వైద్యం అందక పలువురు ప్రాణాలు కోల్పోయారు. వాగు ప్రవాహాల్లో కొట్టుకుపోయి పలువురు మృతిచెందినవారూ ఉన్నారు. ఈ వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలని గిరిజనులు ఎన్నో ఏళ్ల నుంచి ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నెల 8న శంకుస్థాపన చేయనుండగా, అధికారులు, ఏర్పాట్లు చేస్తున్నారు. వంతెనుల మంజూరుతో ఆయా గ్రామాల గిరిజనుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

యూనిఫామ్, పుస్తకాలు అందించాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతీ విద్యార్థికి యూనిఫామ్, పుస్తకాలు అందించాలని డీఈఓ సోమశేఖర శర్మ సూచించారు. శుక్రవారం జిల్లాలోని మండల విద్యాధికారులతో, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023–24 విద్యా సంవత్సరానికి మంజూరైన యూనిఫామ్‌లను ఈ నెల 31లోగా కుట్టించాలని చెప్పారు. పాఠ్యపుస్తకాలు 60 శాతం వరకు గోదాముకు చేరుకున్నాయని, త్వరలో అన్ని మండలాలకు, పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాలన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో చేపడుతున్న పనులను హెచ్‌ఎంలు పర్యవేక్షించాలని చెప్పారు. సబ్జెక్ట్ ఆవశ్యకత ఉన్నత పాఠశాలల్లో వర్క్ అడ్జస్ట్మెంట్‌లో భాగంగా సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులను కలెక్టర్ అనుమతితో సర్దుబాటు చేసేందుకు మండల విద్యాధికారులు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాఠశాలల్లో నిల్వ ఉన్న మధ్యాహ్న భోజన పథకం బియ్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సెక్టోరల్ అధికారులు ఎస్‌కే.సైదులు, నాగరాజశేఖర్, సతీష్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ మాధవరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ

ఆదివాసీ చట్టాలపై కేంద్రం దాడి

- మోదీకి ఇండియా అంటే అంబానీ, అదానీలే..
- నిధుల కోత పెట్టి గ్రామీణుల ఉపాధిపై దెబ్బకొట్టారు
- ఆదివాసీ రాష్ట్రీయ్ మంచ్ అధ్యక్షురాలు బృందాకారత్
- బీజేపీని తెలంగాణలో అడుగు పెట్టనీయం : తమ్మినేని







ర్యాలీలో సంప్రదాయ కొమ్ము నృత్యం చేస్తున్న ఆదివాసీలు (ఇన్‌సెట్) బహిరంగ సభలో మాట్లాడుతున్న బృందాకారత్, తమ్మినేని

భద్రాచలంటౌన్: ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కుల కల్పించే అటవీ హక్కుల చట్టానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని, ఆదివాసీ రక్షణ చట్టాలపై దాడి చేస్తోందని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ అధ్యక్షురాలు, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ విమర్శించారు. భద్రాచలం పట్టణంలో జరుగుతున్న తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర 3వ మహాసభలకు శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ నుంచి కళాశాల మైదానం వరకు ఆదివాసీలు సంప్రదాయ నృత్యాలతో నిర్వహించిన భారీ ర్యాలీ నిర్వహించగా, ఆమె పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. ప్రధానమంత్రి మన్‌కీ బాత్ వదిలి ఆదివాసీల బాధలు వినాలని అన్నారు.

బ్రిటీష్ పాలకులకు లొంగిపోయిన ఆర్‌ఎస్‌ఎస్

ఆనాటి బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఆదివాసీలు పోరాటాలు చేసి ప్రాణత్యాగాలు చేస్తుంటే.. బీజేపీ అనుబంధ ఆర్‌ఎస్‌ఎస్ బ్రిటీష్ పాలకులకు లొంగిపోయిందని ఆరోపించారు. ఇప్పటికీ రైల్వేలో సుమారు 2 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో 30 శాతం కోత విధించి గ్రామీణ ప్రజల ఉపాధి అవకాశాలపై బీజేపీ ప్రభుత్వం దెబ్బకొట్టిందని ఆరోపించారు. మోదీ దృష్టిలో ఇండియా అంటే అంబానీ, అదానీ మాత్రమేనని అన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్‌ఎస్‌కు తాము మద్దతు తెలుపుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోడు సాగుదారులపై దాడులు ఆపి హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల అభివృద్ధికి నిధులు కేటాయించి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

బీజేపీని అడ్డుకునేందుకే బీఆర్‌ఎస్‌తో పొత్తు

తెలంగాణా రాష్ట్రంలో బీజేపీ అడుగు పెట్టకుండా అడ్డుకునేందుకే బీఆర్‌ఎస్‌తో తమ పార్టీ పొత్తు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. అదే సమయంలో ఆదివాసీల సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సీపీఎం పోరాట ఫలితంగానే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోడు భూములకు హక్కు పత్రాలు అందజేస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. హామీని నిలబెట్టుకోకపోతే భద్రాచలం నుంచి హైదరాబాద్ సచివాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామని హెచ్చరించారు. వలస ఆదివాసీల హక్కుల కోసం సీపీఎం ఎల్లప్పుడూ పోరాడుతుందని అన్నారు. భద్రాచలం అభివృద్ధి సీపీఎంతోనే సాధ్యమని, సంక్షేమం, ప్రశాంత వాతావరణం కావాలంటే సీపీఎంను గెలిపించాలని కోరారు. ఈ బహిరంగ సభలో టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబూరావు, టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి తోడసం భీంరావు, పోతినేని సుదర్శన్‌రావు, పి.సోమయ్య, బండారు రవికుమార్, పాయం రవివర్మ, సరియం కోటేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, కారం పుల్లయ్య, దుగ్గి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సేవలు అభినందనీయం

చుంచుపల్లి: వైద్య సిబ్బంది సేవలు అభినందనీయమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.ఎం.రిజ్వీ, కమిషనర్ శ్వేతా మహంతి పేర్కొన్నారు. శుక్రవారం వైద్య సిబ్బందితో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో వారు మాట్లాడారు. వ్యాధి నిరోధక టీకాల విభాగంలో రాష్ట్రంలో జిల్లాకు నాలుగో స్థానం, మాతా శిశు సంరక్షణ విభాగంలో 8వ స్థానం సాధించినందుకు అభినందించారు. జిల్లా నుంచి హాజరైన డీఎంహెచ్ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష మాట్లాడుతూ మరింత శ్రద్ధతో విధులు నిర్వర్తిస్తామని పేర్కొన్నారు. వైద్యాధికారులు సుకృత, శ్రీనివాసరావు, బాలాజీ, చైతన్య, పర్షియా నాయక్, మణికంఠ రెడ్డి, స్పందన తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి..

అశ్వాపురం: మండలంలోని అశ్వాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో జగ్గారం, మిట్టగూడెం, అమ్మగారిపల్లి, పాములపల్లి గ్రామ పంచాయతీల్లోని గ్రామాల రైతుల ధాన్యం త్వరితగతిన కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు విన్నవించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం కొనుగోలు ఇబ్బందులను రైతులు ఎమ్మెల్యే రేగా దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన అదనపు కలెక్టర్‌కు ఫోన్‌లో సమస్యలు వివరించారు.

ప్రజల ఆరోగ్యం బాధ్యత ఆశ కార్యకర్తలదే



మాట్లాడుతున్న జి.శ్రీనివాస్

చండ్రుగొండ: గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితిని ఆశ వర్కర్లు తెలుసుకోవాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ జి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆశ డే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షయ వ్యాధి గురించి, నివారణ కోసం మందులు వాడే విధానం గురించి ఆశ కార్యకర్తలకు వివరించారు. టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. పల్లె దవాఖాన, హెల్త్‌వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణ, ఆయుష్మాన్ భారత్, ఇమ్యూనైజేషన్, ఎన్‌సీడీ, కంటివెలుగు శిబిరాల నిర్వహణ తీరుతెన్నులపై ఆరా తీశారు. సమావేశంలో డాక్టర్ కనకం తనుజ, డీపీఎంఓ వెంకటేశ్వరరావు, శంకరమ్మ, ఎండీ ఇమాం, చంద్రకళ, కిరణ్ పాల్గొన్నారు.

మందుపాతరను నిర్వీర్యం చేసిన బలగాలు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పోలీసు బలగాలను మట్టుబెట్టాలనే లక్ష్యంతో మావోయిస్టులు ఏర్పాటు చేసిన మందుపాతరను గుర్తించి పోలీసులు దానిని నిర్వీర్యం చేయడంతో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ్‌పూర్ జిల్లాలోని కొడాలి – పుల్‌మెట్టా అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టిన డీఆర్‌జీ పోలీసు బలగాలు ఆ ప్రాంతాల్లో మందుపాతరలు ఉండవచ్చన అనుమానంతో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో భూమిలోని సుమారు 5 కిలోల శక్తివంతమైన మందుపాతరను గుర్తించి జిల్లా ఎస్పీకి సమాచారం ఇవ్వడంతో ఆ ప్రాంతానికి బాంబు డిస్పోజబుల్ టీంను పంపించి నిర్వీర్యం చేశారు. ఈ విషయాన్ని ఎస్పీ పుష్కర్‌శర్మ ధ్రువీకరించారు.

వివాహేతర సంబంధం ఆరోపణతో దాడి

ఇల్లెందురూరల్: వివాహేతర సంబంధం ఆరోపణలతో మండలంలోని భద్రుతండాకు చెందిన ఓ వ్యక్తిపై శుక్రవారం దాడి చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన ఓ వ్యక్తి భార్యతో ఇంకొకరు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు సమాచారం. సదరు వ్యక్తి ఇంటి వద్ద తన భార్య ఉందని తెలుసుకున్న ఆయన బంధువులను వెంట తీసుకెళ్లి వారిద్దరిపైనే కాకుండా మరికొందరిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కాగా బాధితులు కొమరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

యువతి అదృశ్యం

దమ్మపేట: యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని మందలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భీమవరం మండలం గూట్లపాడు గ్రామానికి చెందిన గాలిదేవర దుర్గారావు మూడు నెలల కిందట మందలపల్లి గ్రామానికి కుటుంబంతో వచ్చి నివాసం ఉంటున్నాడు. గత నెల 30వ తేదీన దుర్గారావు కుమార్తె (19) రాత్రి 11 గంటల వరకు కుటుంబ సభ్యులతోనే ఉండి.. అదే రోజు అర్ధరాత్రి నుంచి కనిపించకుండా పోయింది. దుర్గారావు చుట్టుపక్కల వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఇల్లెందు: పట్టణంలోని ఇందిరానగర్‌లో శుక్రవారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. సీఐ టి.కరుణాకర్ నేతృత్వంలో ఎస్‌ఐ రాజేశ్ దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ.29 వేల నగదును సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇందులో యువకులు, రాజకీయ నేతలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా కొన్ని రహస్య స్థావరాలను ఏర్పర్చుకొని పేకాట ఆడుతున్నట్లు తెలిసింది. ఇక ఇల్లెందు – బయ్యారం సరిహద్దులోని అటవీ ప్రాంతాలతో పాటు కొన్ని గ్రామాల్లో పేకాట స్థావరాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. కొందరు దళారులు గుట్టుచప్పుడు కాకుండా రాజకీయ అండదండలతో అక్రమంగా స్థావరాలు నిర్వహించి, అందినంత దోచుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,205

నాడి పట్టేవారేరీ?



భద్రాచలం ఏరియా ఆస్పత్రి

ప్రభుత్వ ఆస్పత్రిలో వేధిస్తున్న వైద్యుల కొరత

- గైనకాలజిస్టులు లేక ప్రసూతి సేవలు అంతంతమాత్రమే
- ఐదుగురు గైనకాలజిస్టులకు గాను విధులు నిర్వర్తిస్తున్నది ఒక్కరే!
- 75 పోస్టులు ఖాళీగానే..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏజెన్సీ ప్రజల ఆరోగ్యావసరాలకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రే పెద్ద దిక్కు. గర్భిణులంతా వైద్య సేవలకు, కాన్పులకు ఇక్కడికే వస్తుంటారు. ఆంధ్రా, తెలంగాణ, ఛత్తీస్‌ఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని ఆదివాసీలు ప్రధానంగా ఇక్కడికే ప్రసవాల కోసం వస్తుంటారు. ఈ రాష్ట్రాల నుంచే కాకుండా భద్రాచలం పరిసర ప్రాంతాలైన మణుగూరు, పాల్వంచతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని వైద్యులు కూడా అత్యవసర కేసులను ఇక్కడికే పంపిస్తుంటారు. కాన్పులు చేయటంలో ఈ ఆస్పత్రికి మంచి రికార్డ్ ఉంది. జాతీయస్థాయి పురస్కారాలు కూడా అందుకుంది. అయితే ఆస్పత్రిలో సరిపడా వైద్యులు, సిబ్బంది లేక ఇబ్బందులు తప్పడం లేదు. భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఆస్పత్రిలో పూర్తిస్థాయి వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో వైద్య సేవలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దాదాపు నాలుగు రాష్ట్రాల ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఈ 100 పడకల సామర్థ్యం గల భద్రాచలం ఆస్పత్రిని 2018లో 200 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా నూతన భవనాలను నిర్మించటంతో పాటు అధునాతన వైద్య పరికరాలను కూడా అందుబాటులో ఉంచారు. ఇంత వరకూ బాగానే ఉంది. కానీ, సరిపడినంత మంది వైద్యులను, సిబ్బందిని నియమించకపోవటంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో సరైన వైద్యం అందటం లేదు. భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో 207 మంది వైద్యులు, సిబ్బంది ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 85 మంది రెగ్యులర్, 25 మంది కాంట్రాక్ట్, 22 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇలా మొత్తంగా 132 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. వారిలో ఉండాల్సిన వైద్యుల కంటే తక్కువ మంది వైద్యులు మాత్రమే ఉండడంతో వారిపై అదనపు భారం పడుతోంది. ఆస్పత్రిలో ప్రసూతి, అత్యవసర సేవలు అందించేందుకు సరిపడా వైద్యులు లేక అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ఇక్కడికి ప్రధానంగా ఆదివాసీ కుటుంబాలే ఎక్కువగా వైద్యం కోసం వస్తుంటారు. ఇక్కడి ఆస్పత్రిలో ప్రసవం చేసే డాక్టర్లు లేకపోవడంతో రోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఐదుగురు గైనకాలజిస్టు పోస్టులు ఉండాలి. కానీ, వీటిని ఏళ్ల తరబడి భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. కాంట్రాక్ట్ డాక్టర్లను తీసుకుంటే తమ విధులకు రిజైన్ చేసి వెళ్లిపోతున్నారు. గతేడాది ఇక్కడ ముగ్గురిని నియమిస్తే ఇద్దరు వైద్యులు తమ ఉద్యోగాలనే వదిలేసి వెళ్లిపోయారు. అందుకు ప్రధాన కారణం చేస్తున్న ఉద్యోగానికి ఇస్తున్న జీతంలో ఉన్న మార్పులే ప్రధాన కారణంగా తెలుస్తోంది.

అందని ప్రసూతి సేవలు

ఆస్పత్రిలో ప్రసూతి వైద్యులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో గర్భిణులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఆస్పత్రికి కాన్పు కోసం వచ్చే గర్భిణుల సంఖ్య అధికంగా ఉంటుంది. భద్రాచలం పరిధిలో గల వివిధ గ్రామాల నుంచి నిత్యం అధిక సంఖ్యలో కాన్పు కోసం గర్భిణులు వస్తుంటారు. ప్రస్తుతం గైనకాలజిస్టు ఒక్కరే ఉండటంతో ప్రసూతి సేవలు అందరికీ అందించడం సాధ్యం కావడం లేదు. గతంలో ఈ ఆస్పత్రిలో నెలకు 300లకుపైగా కాన్పులు చేసేవారు. కానీ, గైనకాలజిస్ట్, మత్తు డాక్టర్ ఒక్కరే ఉండటంతో గత నెలలో 234 కాన్పులే చేశారు. ఆపరేషన్ చేయాల్సి వచ్చినప్పుడు లేదా ఒకేరోజు అధిక సంఖ్యలో ఆపరేషన్లు చేయాల్సి వస్తే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎక్కువ కాన్పులు చేయాల్సి వస్తే కొందరిని కొత్తగూడెం, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి పంపిస్తున్నారని గర్భిణులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు.

పనిభారం పెరుగుతోంది..



భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదుగురు గైనకాలజిస్టులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం నేను మాత్రమే పని చేస్తున్నాను. దీంతో పనిభారం పెరుగుతోంది. నిత్యం అధిక సంఖ్యలో వచ్చే గర్భిణులకు కాన్పులు చేస్తున్నాం. అయినా కష్టంగా మారుతోంది. రాత్రి, పగలు విధులు నిర్వహించడం ఇబ్బందిగా ఉన్నప్పటికీ సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ నవ్య, గైనకాలజిస్ట్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. ఇటీవల ఇద్దరు గైనకాలజిస్టులు రాజీనామా చేశారు. అయినప్పటికీ గర్భిణులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. వైద్యులు, సిబ్బంది భర్తీ అనేది రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల పరిధిలో ఉంటుంది. విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లాం..

–డాక్టర్ రామకృష్ణ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

వారు'సమ్మతి'ంచారు

- ముందస్తు మున్సిపల్ సమావేశంలో అంగీకారం తెలిపిన అసమ్మతి సభ్యులు
- ప్రస్తుతానికి సద్దుమణిగిన వైరం..
- నేడు మున్సిపల్ సాధారణ సమావేశం



ముందస్తు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఇల్లెందు: మున్సిపల్ సాధారణ సమావేశానికి అధికారపక్ష సభ్యులు హాజరయ్యేందుకు అంగీకరించారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే హరిప్రియ అధ్యక్షతన జరిగిన ముందస్తు సమావేశంలో పలు అంశాలు చర్చించారు. ఐదు గంటల పాటు అజెండాలోని 67 అంశాల మీద చర్చించారు. అధికార పక్షంలో తలెత్తిన వివాదంలోని అంశాల జోలికి వెళ్లకుండా కేవలం మున్సిపల్ సాధారణ సమావేశం ఎజెండాలోని అంశాల మీద చర్చించారు. పలు అంశాల మీద అధికార పక్షంలోని అసమ్మతి సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మూడు నెలల కాలానికి పరిమితం చేస్తూ ఎజెండా రూపొందించాలని కొంత మంది సభ్యులు సూచించటంతో అంగీకరించారు. పది రుపాయలతో పూర్తి చేసే పనిని రూ.20గా రూపొందించారని, అలాంటి వాటిని వ్యతిరేకించినట్లు తెలిసింది. మున్సిపాలిటీకి రెగ్యులర్ ఏఈ, డీఈలు నియామకమైనందున ఔట్ సోర్సింగ్ ద్వారా పని చేస్తున్న ఏఈని తప్పించాలని అసమ్మతి సభ్యులు పట్టుపట్టినట్లు సమాచారం. అవిశ్వాస అంశం, క్యాంపు రాజకీయం, సభలు, సమావేశాలు, సభ్యుల మధ్య ఘర్షణలు, పోలీసుల కేసులు లాంటి అంశాల జోలికి వెళ్లకుండా కేవలం మున్సిపల్ ఎజెండాలోని అంశాలను చర్చించి అభ్యంతరాలను సాధారణ సమావేశంలో వ్యతిరేకించాలని నిర్ణయించుకుని సమావేశానికి హాజరు కావాలని నిర్ణయించారు. దీంతో ఇక మున్సిపల్ సాధారణ సమావేశానికి గ్రీన్ సిగ్నల్ లభించినట్లేనని అధికార పక్షంలో ఇరు వర్గాల సభ్యులు పేర్కొంటున్నారు. ఎమ్మెల్యే హరిప్రియ ఆధ్వర్యంలో జరిగిన ఈ ముందస్తు సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్ సయ్యద్ జానీపాషా, ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, కమిషనర్ అంకుషావలి తదితరులు ఉన్నారు.

పెద్ద తేడాలు లేవు..

ముందస్తుగా ఎమ్మెల్యే హరిప్రియ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అధికార పక్ష సభ్యులు హాజరవుతామని అంగీకారం తెలిపారు. ఎజెండాలో ఉన్న 67 అంశాలపై పెద్ద తేడాలు ఏమీ లేవు. చర్చించుకుని పరిష్కరించుకోదగ్గ అంశాలే. పాలనా పరమైన అంశాలుంటాయి. వాటిని అధికారులు చూస్తారు. సమావేశానికి హాజరయ్యేందుకు సభ్యులు సుముఖత వ్యక్తం చేయటం శుభపరిణామం. అంతా కలిస్తే మున్సిపాలిటీ మరింత ముందుకుసాగే చాన్స్ ఉంది.

–దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, చైర్మన్

అంశాలవారీగా అభ్యంతరాలే..

మున్సిపల్ సాధారణ సమావేశంలో ఎజెండాలో రూపొందించిన 67 అంశాల మీద సభ్యులు కొన్ని అభ్యంతరాలు లేవనెత్తారు. వాటిని సరిచేస్తే అభ్యంతరాలు కూడా తొలగిపోతాయి. ఇక సభ్యులకు కావాల్సింది ఏముంటుంది? వార్డుల్లో సమస్యల పరిష్కారం, స్వేచ్ఛ, గౌరవం వారికి లభిస్తే ఏ సమస్య రాదు. వ్యక్తిగతంగా ఎవరితోనూ విభేదాలు లేవు. సాధారణ మున్సిపల్ సమావేశానికి హాజరవుతాం.

–సయ్యద్ జానీపాషా, వైస్ చైర్మన్

భూసేకరణను నిరంతరం పర్యవేక్షించాలి

కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): భూసేకరణ ప్రక్రియను నిరంతర పర్యవేక్షించాలని కలెక్టర్ అనుదీప్ పేర్కొన్నారు. ఐడీఓసీలో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ఇరిగేషన్, సింగరేణి, ఎల్అండ్‌టీ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్ మొదటి, రెండో దశ, పులుసుబొంత ప్రాజెక్టులకు భూసేకరణ, జీకేటీసీ, కోయగూడెం, కిష్టారం గ్రామాల ప్రజలకు ఆర్అండ్ఆర్ పరిహారం తదితర అంశాలపై చర్చించారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో పెండింగ్‌లో ఉన్న 66 ఎకరాలకు సంబంధించి ఈనెల 12 వరకు పేపర్ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ములకలపల్లి, దమ్మపేట మండలాల్లో భూసేకరణ ప్రక్రియలో తలెత్తిన సమస్యలపై నివేదికలు ఇవ్వాలని తహసీల్దార్లను ఆదేశించారు. పరిహారం చెల్లించాల్సిన రైతుల జాబితాను గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నోటీసు బోర్డులో ప్రదర్శించాలని తెలిపారు. సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు భూసేకరణలో ఏర్పడిన సమస్యను రెండు వారాల్లో పరిష్కరించాలని చెప్పారు. మణుగూరు, అశ్వాపురం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో రైతులతో సమావేశం నిర్వహించాలని, వారు అంగీకరించనిపక్షంలో అథారిటీకి సిఫారసు చేయాలని సూచించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు రెండో దశలో అవసరమైన 652 ఎకరాల సేకరణ ప్రక్రియలో ఈ నెల 20లోగా సర్వే పూర్తి చేయాలన్నారు. ఇల్లెందు జీకేటీసీ, కోయగూడెం, కిష్టారం గ్రామాల్లో ఆర్అండ్ఆర్ ఇవ్వాలని ఫిర్యాదులు వస్తున్నాయని సింగరేణి, రెవెన్యూ అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ సీఈలు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డితో పాటు అధికారులు కుసుమకుమారి, అశోకచక్రవర్తి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

అప్పటిదాకా అక్క పెళ్లి వేడుకలో..

- ఫిట్స్‌తో స్పృహ కోల్పోయి తమ్ముడి మృతి
- పెళ్లింట్లో తీవ్ర విషాదం



అక్క పెళ్లి సందర్భంగా తల్లిదండ్రులతో రేవంత్ దిగిన చివరి ఫొటో

టేకులపల్లి: బాజా భజంత్రీలు, బంధుమిత్రులతో సందడిగా ఉన్న పెళ్లి ఇంట్లో విషాదం నెలకొంది. కుమార్తెకు అప్పగింతలు చేసి అత్తారింటికి పంపిన రోజునే తల్లిదండ్రులు కుమారుడికి దహన సంస్కారాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పటివరకు అక్క పెళ్లి వేడుకల్లో పాల్గొన్న తమ్ముడు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో మృతి చెందాడు. ఈ ఘటన టేకులపల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కార్పెంటర్ వెనగంటి రవీంద్రాచారి, భవాని దంపతులకు కుమార్తె(నవ్యశ్రీ), కుమారుడు రేవంత్ (22) ఉన్నారు. రేవంత్ నాలుగేళ్ల వయసు వరకు ఆరోగ్యంగానే ఉన్నాడు. ఆ తర్వాత కాళ్లల్లో గుజ్జు కరిగి నడవలేని స్థితికి చేరడమే కాక మానసిక అనారోగ్యానికి గురయ్యాడు. అనేక ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా నయం కాకపోవడంతో 22 ఏళ్ల వయసు వచ్చినా చిన్న పిల్లల మనస్తత్వంతో ఉండేవాడు. దీనికి తోడు అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుండడంతో తల్లిదండ్రులు కుమారుడిని పసిపిల్లాడిలా చూసుకుంటున్నారు. కాగా డిగ్రీ పూర్తి చేసిన రవీంద్రాచారి కుమార్తె నవ్యశ్రీకి నల్లగొండకు చెందిన యువకుడితో వివాహం కుదిర్చారు. శుక్రవారం ఉదయం 10.53 గంటలకు ముహూర్తం కాగా, బంధుమిత్రులతో ఇల్లు కళకళలాడుతోంది. రేవంత్ కూడా పెళ్లి వేడుకలో తిరుగుతూ ఉదయం 8 గంటల ప్రాంతంలో తల్లిదండ్రులతో ఫొటో దిగాడు. అందరూ పెళ్లి పనుల్లో బిజీగా ఉండగా 9 గంటల సమయాన రేవంత్ ఫిట్స్‌తో కింద పడిపోయాడు. ఫిట్స్ అప్పుడప్పుడు వస్తున్న నేపథ్యాన తల్లిదండ్రులను పెళ్లి వద్దే ఉంచి ఇతర కుటుంబ సభ్యులు సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే స్పృహ కోల్పోయి చలనం లేకుండా ఉండటంతో వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోవడంతో మృతి చెందాడని ధ్రువీకరించారు. కాగా కుమారుడు చికిత్స పొందుతున్నాడని భావించి తల్లిదండ్రులు కూతురు వివాహం జరిపించి అప్పగింతలు చేసి అత్తారింటికి పంపారు. అనంతరం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకురావడంతో ఒక్కసారిగా గుండెలవిసేలా రోదించారు. కుమార్తెను కన్యాదానం చేసిన రోజునే కుమారుడికి అంత్యక్రియలు చేయాల్సి వచ్చిందంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. బంధుమిత్రులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు.

నాటు తుపాకీ పేలడంతోనే యువకుడి మృతి

- వేటకు వెళ్లిన సందర్భంలోనే ఘటన
- వివరాలు వెల్లడించిన సీఐ నాగరాజు



నాటు తుపాకీ, నిందితుడు నాగేందర్‌ను చూపుతున్న పోలీసులు

ములకలపల్లి: అల్లిగూడెం అటవీ ప్రాంతంలో వేటకు వెళ్లిన క్రమంలో, నాటు తుపాకీ మిస్‌ఫైర్ కావడంతోనే రాచూరుపల్లికి చెందిన యువకుడు సవలం నాగబాబు మృతి చెందినట్లు పాల్వంచ సీఐ మేడేపల్లి నాగరాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. దమ్మపేట మండలం రాచూరుపల్లి గ్రామానికి చెందిన నాగరాజు తన నాటు తుపాకీతో మండలంలోని అల్లిగూడెం గ్రామానికి చెందిన ఊకే నాగేందర్‌తో కలిసి శనివారం రాత్రి సమీప అటవీ ప్రాంతానికి వన్యమృగాలను వేటాడేందుకు వెళ్లారు. నాగేందర్ తుపాకీ పట్టుకొని నడిచి వెళ్తుండగా చెట్ల కొమ్మలు తగలడంతో ఒక్కసారిగా పేలింది. నాగేందర్ ముందు నడుస్తున్న నాగరాజుకు బుల్లెట్ తగలడంతో ఘటనాస్థలిలోనే ప్రాణాలొదిలాడు. దీంతో గ్రామపెద్ద ముత్తుకు ఫోన్లో విషయం తెలిపిన నాగేందర్ అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో గ్రామస్తులు, మృతుడి బంధువులు అడవిలో గాలించగా, ఆదివారం ఉదయం దేవినేనిగుట్ట సమీపంలో నాగరాజు మృతదేహం లభించింది. ఈ తరుణంలో గుట్టుచప్పుకాకుండా ఆటోలో మృతదేహాన్ని రాచూరుపల్లికి తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. ఘటనపై వీఆర్‌ఏ కనకం శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. కాగా, నిందితుడు నాగేందర్ శుక్రవారం గ్రామస్తుల సమక్షంలో స్థానిక పోలీస్‌స్టేషన్లో నాటు తుపాకీతో లొంగిపోయాడు. తుపాకీని స్వాధీన పరచుకొన్న పోలీసులు నాగేందర్‌ను అరెస్ట్ చేశారు. పోలీసులకు సమాచారం తెలుపకుండా మృతదేహాన్ని తరలించిన ఆటోతోపాటు సహకరించిన వ్యక్తులపై విచారణ జరుపుతున్నామని, వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ ప్రకాశ్‌రావు, కానిస్టేబుల్ భాను ఉన్నారు.

వేటాడితే కఠిన చర్యలు

అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని సీఐ నాగరాజు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నాటు తుపాకీలు, విల్లంబులు, బాణాలు వంటి మారణాయుధాలు ఉంటే వాటిని స్థానిక పోలీస్‌స్టేషనల్లో అప్పగించాలని తెలిపారు. త్వరలో సర్పంచ్‌లతో సమావేశం ఏర్పాటు చేసి, వేటకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

ఆమె భర్తకు తీవ్ర గాయాలు



గాయపడిన వెంకటరాములు


మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని హనుమాన్ టెంపుల్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందగా ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డాడు. మణుగూరు ఏరియా పీవీకాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు వెంకటరాములు.. అతని భార్య సోమలక్ష్మి(60)తో కలిసి తన ద్విచక్రవాహనంపై భద్రాచలంలో డయాలసిస్ చేయించుకోవడానికి బయలుదేరారు. హనుమాన్ ఆలయం వద్ద ద్విచక్ర వాహనం పెట్టి బస్సులో వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. హనుమాన్ ఆలయం వద్ద రోడ్డు దాటే క్రమంలో పెళ్లి వేడుక కోసం వస్తున్న బస్సు వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న దంపతులు రోడ్డుపై పడ్డారు. సోమలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది. వెంకటరాములు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను 108 ద్వారా ఆస్పత్రి తరలించారు.

బాలిక మృతికి కారణమైన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

కొత్తగూడెంటౌన్: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికకు శారీరకంగా దగ్గరై పెళ్లికి నిరాకరించడంతో సదరు బాలిక ఆత్మహత్య చేసుకుంది. బాలిక మరణానికి కారణమైన ఆళ్లపల్లి మండలం పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన తాటి ప్రవీణ్‌కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తూ శుక్రవారం కొత్తగూడెం మొదటి అదనపు జడ్జి (పోక్సో స్పెషల్ జడ్జి) ఎం.శ్యాంశ్రీ తీర్పు చెప్పారు. ఆళ్లపల్లి మండలం పెద్దవెంకటాపురం గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన తాటి ప్రవీణ్ ప్రేమించానని.. పెళ్లి చేసుకుంటానని చెప్పి, శారీరకంగా దగ్గరై ఆ తరువాత పెళ్లికి నిరాకరించాడు. పెద్దమనుషులు పంచాయితీ చేయగా పెళ్లికి అంగీకరించి వెళ్లి పోవడంతో తనను మోసం చేశాడని భావించిన బాలిక 2020 సెప్టెంబర్ 23వ తేదీన పురుగులమందు దాగింది. కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అదేరోజు ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2020 అక్టోబర్ 4న బాలిక మృతిచెందింది. అనంతరం ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఇల్లెందు డీఎస్పీ పి.రవీందర్‌రెడ్డి కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. 14 మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి తాటి ప్రవీణ్‌కు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పీవీడీ లక్ష్మి వాదించారు.

మద్యం మత్తులో యువకుడు మృతి

గుర్తించేలోగా కుళ్లిపోయిన మృతదేహం



వినయ్ (ఫైల్)

కారేపల్లి: మద్యం మత్తులో పడుకున్న ఓ యువకుడు మత్తులోనే మృతి చెందగా.. కుటుంబీకులు గుర్తించే సరికి మృతదేహం కుళ్లిపోయింది. ఈ ఘటన మండలంలోని గాదెపాడులో శుక్రవారం వెలుగు చూసింది. గాదెపాడుకు చెందిన నాగమణి తన కుమారుడు జక్కుల వినయ్(25)తో కలిసి జీవిస్తోంది. ఇటీవల మద్యానికి బానిసైన వినయ్ ఇంట్లో నుంచి వెళ్లి రెండు మూడు రోజులకోసారి వచ్చేవాడు. ఈక్రమంలోనే నాలుగు రోజుల క్రితం నాగమణి బంధువుల ఇంట్లో శుభకార్యం కోసం ఊరికి వెళ్లి రెండు రోజుల క్రితం వచ్చింది. ఇంటి వద్ద కుమారుడు వినయ్ లేకపోవటం, ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఆచూకీ కోసం యత్నిస్తోంది. ఇంతలోనే శుక్రవారం ఇంటి ప్రాంగణంలో దుర్వాసన వస్తుండటంతో డాబా పైకి వెళ్లి చూడగా దుప్పటి కప్పుకుని పడుకున్న స్థితిలో వినయ్ మృతి చెందగా, మృతదేహానికి పురుగులు పట్టి కుళ్లిపోతోంది. నాలుగు రోజుల క్రితమే అతిగా మద్యం సేవించి పడుకున్న ఆయన దాహంతో మృతి చెంది ఉంటాడని కుటుంబీకుల అనుమానం మేరకు కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్సై పి.రామారావు తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి...

పెనుబల్లి: కుమార్తెను చూద్దామని బయలుదేరిన వ్యక్తి వడదెబ్బ బారిన పడి మృతి చెందాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా చాట్రాయ్ మండలం నరసింహారావు పాలెంకు చెందిన పరిమి వెంకటేశ్వరరావు (48) పెనుబల్లి మండలం మండాలపాడులో ఉంటున్న కుమార్తె ఇంటి వద్దకు శుక్రవారం బయలుదేరాడు. మార్గమధ్యంలో వీఎం బంజర్ సెంటర్‌లో అస్వస్థతకు గురైన ఆయన అపస్మారక స్థితిలో పడిపోయి మృతి చెందాడు. దీంతో స్థానికులు ఆయన వద్ద ఉన్న వివరాల ఆధారంగా కుమార్తెకు సమాచారం ఇవ్వడంతో వెంకటేశ్వరరావు మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకెళ్లారు.

హుండీలో నగదు చోరీ

పెనుబల్లి: మండలంలోని ఎర్లబంజర్ శ్రీకోదండ రామ ఆలయంలో చోరీ జరిగింది. ఈ నెల 2వ తేదీన రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో ప్రవేశించి హుండీ పగులగొట్టి సుమారు రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారు.

క్లుప్తంగా...

సీబీఐ కోర్టులో లొంగిపోయిన గంగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్‌: మాజీమంత్రి వైఎస్‌ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ–1 నిందితుడు ఎర్ర గంగిరెడ్డి శుక్రవారం హైదరాబాద్‌ నాంపల్లి సీబీఐ కోర్టులో లొంగిపోయారు. గంగిరెడ్డి బెయిల్‌ రద్దుచేస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసిందే. జూన్‌ 30 వరకు జ్యూడిషియల్‌ రిమాండ్‌ విధించింది. ఆ తర్వాత రూ.లక్షన్నర పూచీకత్తుతో ట్రయల్‌ కోర్టు నుంచి బెయిల్‌ పొందవచ్చని గంగిరెడ్డికి సూచించింది. వివేకా హత్యకేసులో గంగిరెడ్డిని 2019 మార్చి 28న అరెస్ట్‌ చేశారు. 90 రోజులు గడిచినా ఆయనపై సిట్‌ చార్జిషీట్‌ దాఖలు చేయకపోవడంతో ఆయనకు కడప కోర్టులో డీఫాల్ట్‌ బెయిల్‌ వచ్చింది. అప్పటి నుంచి బయటే ఉన్న ఆయన హైకోర్టు ఆదేశాల మేరకు లొంగిపోయారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయన్ని జైలుకు తరలించారు.

వైఎస్సార్‌సీపీలోకి బొమ్మిరెడ్డి

సాక్షి, అమరావతి : పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్, టీడీపీ నేత బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలో క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. బొమ్మిరెడ్డితో పాటు ఆత్మకూరు మార్కెట్‌ యార్డ్‌ మాజీ చైర్మన్, టీడీపీ నేత ఇందూరు వెంకటరమణారెడ్డిలు కూడా వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, వరప్రసాద్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. టీడీపీలో డబ్బులున్న వారికే పదవులు దక్కుతాయని బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి చెప్పారు. సీఎం జగన్‌ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన అనంతరం ఆయన తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్‌ వద్ద విలేకరులతో మాట్లాడారు.

నేడు ఏపీ టెన్త్‌ ఫలితాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టెన్త్‌ పబ్లిక్‌ పరీక్షల ఫలితాలు శనివారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ ఫలితాలను విజయవాడలో విడుదల చేయనున్నారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన టెన్త్‌ పరీక్షలకు 6.40 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వీరిలో 6,05,052 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో బాలికలు 2,95,807 మంది..బాలురు 3,09,245 మంది ఉన్నారు. ఫలితాలను https://www.sakshieducation.comలో చూడవచ్చు.

నర్రెడ్డి సోదరులు చెప్పినట్టే చేశా

ఓ టీవీ చానల్‌ ఇంటర్వ్యూలో వివేకా పీఏ కృష్ణారెడ్డి సంచలన వ్యాఖ్యలు

- ఓ టీవీ చానల్‌ ఇంటర్వ్యూలో వివేకా పీఏ కృష్ణారెడ్డి సంచలన వ్యాఖ్యలు
- లెటర్, ఫోన్‌ దాచిపెట్టమని రాజశేఖరరెడ్డి చెప్పారు
- ఆ విషయాలన్నీ ఎవరికీ చెప్పొద్దన్నారు
- నుదుటిపై దెబ్బ, బెడ్‌ రూమ్‌.. బాత్‌రూంలో రక్తం ఉందని కూడా చెప్పాను
- వాళ్లవన్నీ ఏమీ పట్టించుకోలేదు.. మేం చూసుకుంటామన్నారు
- ఎర్రగంగిరెడ్డి ఇంట్లోకి వచ్చిన వెంటనే రక్తం వాంతులని చెప్పాడు
- ఈయన సూచన మేరకే పనిమనిషి లక్ష్మి, రాజశేఖర్, ట్యాంకర్‌ బాషాలు శుభ్రం చేశారు
- నా ఫోన్‌లో సీఐ శంకరయ్యతో నర్రెడ్డి రాజశేఖరరెడ్డి మాట్లాడారు
- తాము చెప్పినట్లు వినకపోతే జైలుకెళ్తావని సునీతమ్మ అన్నారు

సాక్షి ప్రతినిధి, కడప : మాజీ మంత్రి వైఎస్‌ వివేకానంద రెడ్డి మృతి చెందాక ఆయన అల్లుడు.. బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, అతని సోదరుడు నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిలు చెప్పినట్టే చేశానని వివేకా పీఏ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. పెద్దోళ్లు కనుక వారు చెప్పినట్టే చేయాల్సి వచ్చిందన్నారు. 'వారు చెప్పినట్లు చేయకపోతే నువ్వు కూడా జైలుకు వెళ్తావు' అని వివేకా కుమార్తె సునీతమ్మ కూడా చెప్పడంతో వారి సూచనల మేరకు నడుచుకున్నానని ఇటీవల ఆయన ఓ టీవీ చానల్‌ (ఎన్‌టీవీ)కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పూసగుచ్చినట్లు వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

రోజులాగే ఆ రోజు వెళ్లాను

నేను 30 ఏళ్లకు పైగా వివేకా సార్‌ వద్ద పని చేస్తున్నాను. ప్రతిరోజు 5.30 గంటలకు సార్‌ ఇంటికి వెళ్లే అలవాటు. ఆ రోజు కూడా అలాగే వెళ్లాను. ఆయన నిద్ర లేచి ఉంటే హాలులో లైట్‌ వేస్తారు. వాచ్‌మన్‌ రంగన్న పడుకొని ఉన్నాడు. సార్‌ ఇంకా లేవలేదని బయటికి వచ్చి, వీధిదీపం కింద ఐదు నిమిషాలు ఆంధ్రజ్యోతి పేపర్‌ తిరగేశాను. వివేకా సతీమణి సౌభాగ్యమ్మకు ఫోన్‌ చేశాను. 'సార్‌ లేట్‌గా వచ్చి ఉంటాడులే.. కొద్దిసేపు పడుకోని' అని ఆమె సూచించారు. తిరిగి పేపర్‌



చదువుతుండగా.. వంట మనిషి లక్ష్మి, ఆమె కుమారుడు వచ్చారు. సార్‌ ఇంకా లేవలేదా? అని అడిగారు. 'రాత్రి లేట్‌గా వచ్చి ఉంటారు.. లేప వద్దని మేడమ్‌ చెప్పింది' అని చెప్పాను. కొద్దిసేపటి తర్వాత.. సార్‌ లేవకపోతే లేపాలి కదా.. మళ్లీ ఎందుకు లేపలేదు.. అని అరుస్తారని వంటమనిషి లక్ష్మిని బెడ్‌రూమ్‌ సైడుకు వెళ్లి పిలవాలని చెప్పాను. లక్ష్మి బెడ్‌రూము వద్దకు వెళ్లి పిలిచి వచ్చే సమయంలో వాచ్‌మన్‌ రంగన్న లేచి.. బెడ్‌షీట్‌ను సందులో పెట్టి ఉత్తరం వైపు ఉండే గార్డెన్‌ వైపు వెళ్లిపోయాడు. అంతలోనే వాచ్‌మెన్‌ రంగన్న పరుగెత్తుకుంటూ వచ్చి సార్‌ పడిపోయాడని చెప్పాడు. నేను వంటమనిషి కుమారుడు ప్రకాశ్‌ నార్త్‌ సైడ్‌ వాకిలి గుండా లోపలికి పరుగెత్తాము.

లోపలికి వెళ్లి చూస్తే అంతా రక్తమే

ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బెడ్‌రూం అంతా రక్తం. భయం వేసింది. ఏసీ, లైట్‌ ఆన్‌లో ఉంది. సార్‌ మాత్రం బెడ్‌పై లేడు. బాత్‌రూములో పడిపోయి ఉన్నాడు. నాడి పట్టుకుని చూశా. తలపై గాయం కనిపిస్తోంది. నాతోపాటు ఉన్న ప్రకాశ్‌తో మన సార్‌ మనకు లేడని చెప్పా. బయటికి వచ్చి వివేకా సార్‌ అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్‌ చేశాను. 'బావ ఇక మనకు లేడు. ఎవరో ఏదో చేశారు. ఏదో జరిగింది. తలపై గాయం కనిపిస్తోంది. ఇల్లంతా రక్తం ఉంది' అని చెప్పాను. తర్వాత ఆయన సోదరుడు శివప్రకాశ్‌రెడ్డికి కూడా అదే చెప్పాను. తర్వాత కొద్దిసేపటికి వైఎస్‌ వివేకా మొబైల్‌ సోఫాలో కనిపించింది. సైలెంట్‌లో ఉంది. ఏదో ఫోన్‌ రావడంతో రింగ్‌ అవుతున్నట్లు గుర్తించి, జేబులో పెట్టుకున్నాను. బెడ్‌ ముందు ఉన్న వీల్‌ చైర్‌ ముందు ఓ పేపరు పడి ఉంది. ప్రకాశ్, నేను దాన్ని ఓపెన్‌ చేసి చూశాము. అందులో సార్‌ రాసిన మ్యాటర్‌ ఉంది. ఆ లెటర్‌లో అక్షరాలు అంత క్లియర్‌గా లేవు. బాగా పరిశీలిస్తే 'డ్రైవర్‌ ప్రసాద్‌ నిన్న డ్యూటీకి త్వరగా రమ్మన్నందుకు నన్ను కొట్టి చంపాడు. మీరు డ్రైవర్‌ ప్రసాద్‌ను వదిలి పెట్టవద్దు' అని రెండుసార్లు రాసి ఉంది. కింద వైఎస్‌ వివేకా అని ఉంది.

లెటర్‌ను ఎవరికీ చూపించొద్దన్నారు

ఆ లెటర్‌ విషయం వెంటనే అల్లుడు రాజశేఖరరెడ్డికి తెలియజేశాను. 'ఆ లెటర్‌ను జాగ్రత్తగా దాచి పెట్టు.. ఎవరికీ చూపించవద్దు' అన్నాడు. నేను పోలీసులతో ప్రాబ్లమ్‌ అవుతుంది కదా అని అడిగాను. 'అదంతా నేను వచ్చిన తర్వాత మాట్లాడతా. నీకు వచ్చిన ఇబ్బందేమీ లేదు. నేను వచ్చాక పోలీసులకు ఇస్తాను. అప్పటి దాకా దాచి పెట్టు' అని చెప్పాడు. ఈ విషయంగా శివప్రకాశ్‌రెడ్డికి కూడా తెలియజేసి.. నాకు దిక్కుతోచడం లేదని చెప్పాను. తర్వాత కొద్దిసేపటికి ఎంపీ వైఎస్‌ అవినాశ్‌రెడ్డి వచ్చాడు. నేనే ఆయన్ను లోపలికి పిలుచుకుని వెళ్లాను. అవినాశ్‌రెడ్డితోపాటు శివశంకర్‌రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి మరి కొంత మంది ఉన్నారు. తర్వాత అవినాశ్‌రెడ్డి సార్‌ బయటికి వచ్చి లాన్‌లో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఆ తర్వాత వైఎస్‌ అవినాశ్‌రెడ్డి చిన్నాన్న, పెద్దనాన్న, కుటుంబ సభ్యులు ఒకరి తర్వాత ఒకరు అక్కడికి వచ్చారు. నేను రంగన్నను పిలిచి దబాయిస్తే, రాత్రి దోశలు తిని నిద్రయానని చెప్పాడు.

పోలీసులకు చెప్పేద్దామంటే వినలేదు

గుండెపోటు విషయం ఎవరు ఎలా చెప్పారో తెలియదు. లెటర్, రక్తాన్ని బట్టి వైఎస్‌ వివేకాను ఎవరో ఏదో చేశారని నేను భావించాను. కొద్దిసేపటికి సీఐ శంకరయ్య, ఎర్రగంగిరెడ్డి వచ్చారు. ఎర్ర గంగిరెడ్డి రావడంతోటే బ్లడ్‌ వామ్‌టింగ్‌ చేసుకున్నాడని చెప్పాడు. బాత్‌రూములో గోడకు ఆరు, ఏడు అడుగులు రక్తం చిమ్మిందని చెప్పగా.. బేసిన్‌కు తల కొట్టుకుని రక్తం వచ్చి ఉంటుందిలే అన్నాడు. ఈ విషయంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తామా అంటే ఏం అవసరం లేదులే అన్నాడు. ఎర్రగంగిరెడ్డి ఇలా చెబుతున్నాడని నేను నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్‌ చేసి చెప్పాను. పక్కన సీఐ ఉన్నాడని మాట్లాడాలని ఫోన్‌ సీఐకి ఇచ్చాను. వాళ్లిద్దరు మాట్లాడుకున్నారు. రాజశేఖరరెడ్డి స్టేషన్‌లో కంప్లైంట్‌ రాసివ్వాలని సూచించారు. కొద్దిసేపటికి ఎర్రగంగిరెడ్డి.. కంప్యూటర్‌ ఆపరేటర్‌ ఇనాయతుల్లాకు 'లక్ష్మమ్మను రమ్మను.. బక్కెట్‌తో నీళ్లు తీసుకుని ఇదంతా క్లీన్‌ చేయాలి' అని చెప్పాడు. లక్ష్మమ్మ సగం క్లీన్‌ చేసి.. కళ్లు తిరుగుతున్నాయని చెప్పి వెళ్లిపోయింది. తర్వాత తన వద్ద పనిచేసే పిల్లలు రాజశేఖర్, ట్యాంకర్‌ బాషాతో ఇనాయతుల్లా క్లీన్‌ చేయించారు. సార్‌ డెడ్‌బాడీ బాత్‌రూము నుంచి తేవడానికి ఎర్రగంగిరెడ్డితో కలిసి నలుగురు వెళ్లారు. తర్వాత అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పోలీసులు బాగా కొట్టారు

అవినాశ్‌రెడ్డి ఉదయాన్నే వచ్చి వెళ్లాడు.. మళ్లీ రాలేదు. రక్తం శుభ్రం చేసే సమయంలో ఆయన లేరు. నేను సీఐ చెప్పినట్లు కంప్లైంట్‌ రాసిచ్చి ఆస్పత్రికి వెళ్లాను. అక్కడి నుంచి ఇంటికి వెళ్లి.. నా భార్యను తీసుకొచ్చి పోస్టుమార్టం రూమ్‌ వద్ద సార్‌ను చూపించాను. తర్వాత సార్‌ డెడ్‌ బాడీని ఇంటి వద్దకు తెచ్చారు. అప్పుడు లెటర్‌ను నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డికి ఇచ్చాను. తర్వాత 15 నిమిషాలకు ఆ లెటర్‌ను ఎస్పీకి అందజేశానని, నీకు ఇబ్బంది లేదని రాజశేఖరరెడ్డి చెప్పాడు. సాయంత్రం 4 – 4.30 గంటల ప్రాంతంలో నన్ను పోలీసులు తీసుకువెళ్లి జీఎన్‌టీయూ గెస్ట్‌హౌస్‌లో పెట్టారు. అక్కడి నుంచి నాతోపాటు మరికొందరిని వేముల పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం కడప డీటీసీకి తీసుకెళ్లి 13 రోజులు పెట్టుకుని అందరినీ కొట్టారు. తర్వాత నాతోపాటు ప్రకాశ్, ఎర్రగంగిరెడ్డిని ముద్దాయిలుగా చూపిస్తూ రిమాండ్‌కు తరలించారు. మూడు నెలలు జైలులోనే ఉన్నాం. మధ్యమధ్యలో సునీతమ్మ, రాజశేఖరరెడ్డి వచ్చి మాట్లాడిపోయే వారు. మేము బయటికి వచ్చిన కొద్దిరోజుల తర్వాత కేసు సీబీకి బదిలీ చేశారు. తర్వాత సునీత, రాజశేఖరరెడ్డి.. సీబీఐకి సహకరించాలని చెప్పేవారు. అప్పటి నుంచి సీబీఐ అధికారులు ఎప్పుడు పిలిచినా వెళ్లి వచ్చాం.

సీబీఐ వాళ్లూ కొడతారనుకోలేదు

సీబీఐ వాళ్లు ఢిల్లీకి రావాలని చెప్పారని నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి తెలియజేశాను. వెళ్లమని చెప్పి.. టికెట్‌ ఆయనే తీసిచ్చాడు. వారికి సహకరించాలని సూచించాడు. ఢిల్లీలో వాళ్లు నెల రోజులు పెట్టుకున్నారు. మధ్యలో రాంసింగ్‌ వచ్చి 'నేను చెప్పినట్లు చెబుతావా? లేదా? వైఎస్‌ అవినాశ్‌రెడ్డి, శంకర్‌రెడ్డిలు మిమ్మల్ని మ్యానేజ్‌ చేశారు. ఆ విషయం మీరు చెప్పడం లేదు. మేము చెప్పినట్లు చెప్పకపోతే జైలుకు పంపుతాం' అని బెదిరిస్తూ కొట్టేవారు. సీబీఐ అధికారులు ఇలా కొడతారని ఊహించలేదు. నెల తర్వాత నన్ను పంపించేశారు. ఆ తర్వాత నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, సునీతలు నన్ను హైదరాబాదుకు రమ్మని పిలిచారు. అక్కడికి వెళ్లాక 'నువ్వు రామ్‌సింగ్‌ సార్‌ ఎలా చెబితే అలా చేయాలి. లేకపోతే ఇబ్బందుల్లో పడతావు. నువ్వు సహకరిస్తే నిన్ను సేవ్‌ చేస్తాం. ఇదొక్కటే మార్గం' అని చెప్పారు. మధ్యమధ్యలో నర్రెడ్డి రాజశేఖరరెడ్డి.. అవినాశ్‌ మ్యానేజ్‌ చేశాడని చెప్పమన్నారు.

అలాగైతే జైలుకెళ్లేది నువ్వేనని భర్తకు సునీత హెచ్చరిక

అవినాశ్‌ నన్ను మేనేజ్‌ చేయడం ఏమిటని అప్పుడే గట్టిగా వ్యతిరేకించాను. అప్పుడు సునీత నాపై ఫైర్‌ అవుతూ 'నువ్వు ఏమనుకుంటున్నావు.. నిన్ను ఎవ్వరూ కాపాడలేరు' అని హెచ్చరించారు. రాజశేఖరరెడ్డి నన్ను సముదాయించేలా భుజం తట్టాడు. నేను ఉన్నది ఉన్నట్లు చెబుతానని తెలియజేశాను. ఆ సమయంలో సునీత.. రాజశేఖరరెడ్డిని ఉద్దేశించి 'కృష్ణారెడ్డి సహకరించకపోతే నువ్వే జైలుకు వెళతావు' అని చెప్పింది. ఆమె అలా ఎందుకు అనిందో నాకు అర్థం కాలేదు. తర్వాత కొద్ది రోజులకు రాత్రి సమయంలో సీబీఐ అధికారి రాంసింగ్‌ నా సెల్‌కు మిస్డ్‌ కాల్‌ ఇచ్చారు. తర్వాత మా అబ్బాయితో ఫోన్‌ చేయించి (రామ్‌సింగ్‌కు తెలుగు సరిగా రాదు కనుక) మాట్లాడించాను.

నిజం చెబితే కొడతారేంటి?

'దస్తగిరి, రంగన్నలు మేము చెప్పినట్లు విన్నారు. నువ్వు కూడా చెప్పినట్లు వింటే సేవ్‌ చేస్తా' అని రామ్‌సింగ్‌ తెలిపారు. తెల్లవారగానే నీ ఇద్దరు కుమారులతో కలిసి కడపలోని కేంద్ర కారాగార గెస్ట్‌హౌస్‌కు రావాలని సూచించారు. నేను ఈ విషయం నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి చెప్పగా, వెళ్లాలని సూచించాడు. హైదరాబాదులోని పిల్లలను పిలిపించి ఉదయం 11 గంటలకు వారితో కలిసి వెళ్లాను. మేము చెప్పినట్లుగా సహకరించాలని కోరారు. ఇందుకు నేను మరోమారు అభ్యంతరం చెబుతూ.. నాకు తెలిసిన విషయాలన్నీ చెబుతానని చెప్పాను. దాంతో ఆయన కట్టె తీసుకుని నన్ను కొట్టాడు. నిజం చెబితే కొడతారా? అంటూ మా పిల్లలు అడ్డుతగిలారు. సాయంత్రం వరకు నన్ను అక్కడే పెట్టుకుని బూతులు తిట్టి పంపారు. మళ్లీ పిలిచినప్పుడు కూడా ఇలాగే మాట్లాడితే నీ కథ ఉంటాదని హెచ్చరించారు.

చెప్పినట్లు వినలేదని పెళ్లి ఆపించేశారు

అప్పటికి వారం రోజుల్లో నా చిన్న కుమారుడి పెళ్లి. సీబీఐ వాళ్లకు నేను సహకరించలేదని నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, సునీతకు కోపం వచ్చింది. వారు పెళ్లి కుమార్తె వారికి ఫోన్‌ చేసి 'కృష్ణారెడ్డి హత్య కేసులో ఉన్నాడు. వైఎస్‌ అవినాశ్‌రెడ్డికి సహకరించాడు. త్వరలో ఆస్తులు స్వాధీనం చేసుకుంటారు. ఈ పెళ్లి క్యాన్సిల్‌ చేసుకోండి' అని ఫోన్‌ చేసి చెప్పారు. నాకు విషయం తెలిసి నేను నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి వద్దకు వెళ్లగా సరైన స్పందన లేదు. పెళ్లి క్యాన్సిల్‌ అయితే కానీ అని నేను నిజాన్ని నిర్భయంగా చెప్పాలని భావించాను. ఆ తర్వాత నా కుమారుడు అమెరికా వెళ్లాడు. నేను ప్రాణ రక్షణ కల్పించాలని ఎస్పీకి వినతిపత్రం ఇవ్వబోతే ఆయన తీసుకోలేదు. అందుకే పులివెందుల కోర్టులో ప్రైవేటు కంప్‌లైంట్‌ వేశాను. దాని గురించి ఇప్పటివరకు అతీగతీ లేదు. నా పాస్‌పోర్టు రెన్యువల్‌ కాకుండా ఆగిపోయింది. నా ప్రమోషన్, నా కుమారుడి పెళ్లి ఆగిపోయాయి. నేను వివేకాకు సేవ చేసినందుకు ఇస్తామన్న ఐదు ఎకరాల భూమి ఇవ్వలేదు. ఇలా అన్ని విధాలా నాకు అన్యాయం జరిగింది. ఇప్పుడు సీబీఐ కొత్త బృందం వచ్చింది. వారికి నాకు తెలిసిన విషయాలన్నీ చెప్పాను. వివేకాకు హైదరాబాద్, పులివెందుల, కడపల 200 ఎకరాలకు పైగా భూమి ఉంది. ఆ ఆస్తులన్నీ దాదాపు కంపెనీ పేరుపైనే ఉండేవి.

జిల్లా వార్తలు

'రైసెట్‌'లో ఉపాధి కోర్సుల్లో శిక్షణ

ఖమ్మంరూరల్‌: ఖమ్మం రూరల్‌ మండలం వరంగల్‌ క్రాస్‌రోడ్డులోని తరుణీ హాట్‌లో ఉన్న రైసెట్‌ కేంద్రంలో నిరుద్యోగ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్‌ విశాల్‌ దేవ్‌ తెలిపారు. జ్యూట్‌ బ్యాగుల తయారీ, సీసీ కెమెరాల నిర్వహణ అంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్హత, 18నుండి 45 ఏళ్ల వయస్సు కలిగిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, నాలుగు ఫొటోలు, బ్యాంక్‌ పాస్‌పుస్తకంతో తమ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. అభ్యర్థులకు ఈనెల 10 నుండి 23 వరకు ఉచిత వసతి, భోజనం సౌకర్యం కల్పించి శిక్షణ ఇస్తామని ఆయన వెల్లడించారు.

పట్టాల పంపిణీపై అభ్యంతరాలు ఉంటే తెలపండి


కల్లూరు: కల్లూరు రెవెన్యూ డివిజన్‌ పరిధి ఏన్కూరు మండలం నాచారం, తూతులింగన్నపేట షెడ్యూల్‌ ఏరియాలోని భూమి సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆర్‌డీఓ సీహెచ్‌ సూర్యనారాయణ తెలిపారు. ఇక్కడి 119, 117 సర్వే నంబర్లలోని భూమికి ఖాజామొహినుద్దీన్‌ సిద్ధిఖీ, ఖాజా అబ్దుల్‌ సిద్ధిఖీ, 53/2, 53/3 సర్వే నంబర్‌లోని భూమికి కొలిపాక సుదేష్ణభాయి, కంకిపాటి లక్ష్మీనర్సింహారావు పట్టాదారులుగా ఉన్నా దశాబ్దాలుగా వారెవరో తెలియడం లేదని పేర్కొన్నారు. ఈ భూమిలో పన్నెండేళ్లుగా గిరిజనులు సాగు చేస్తుండడంతో వారికి పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ విషయమై అభ్యంతరాలు ఉంటే పదిహేను రోజుల్లోగా ఏన్కూరు తహసీల్‌లో లిఖిత పూర్వకంగా తెలపాలని, ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే గిరిజనులకు పట్టాలు జారీ చేస్తామని ఆర్డీఓ శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు.

ఈ నెల 19న వేతన సవరణ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు గనుల్లోని కార్మికుల వేతన సవరణకు సంబంధించి 11వ వేజ్‌ బోర్డు పదో సమావేశం ఈ నెల 19న జరగనుంది. ఈ సమావేశాన్ని కోల్‌కతాలో నిర్వహిస్తున్నట్లు కోలిండియా యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎనిమిది రాష్ట్రాల్లోని బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్న సుమారు 3.2 లక్షల మంది కార్మికుల జీతభత్యాలు, అలవెన్స్‌లు, సౌకర్యాలపై చర్చించనున్నారు. సమావేశంలో కోలిండియా చైర్మన్‌ ప్రమోద్‌ అగర్వాల్, ఇతర విభాగాల డైరెక్టర్లతో పాటు సింగరేణి డైరెక్టర్లు, జీఎంలు, జాతీయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారు.

పెంపు సరే.. ఇవ్వడం ఎలా?

- జీపీ కార్మికుల వేతనాల పెంపు భారం పంచాయతీలపైనే..
- ఇప్పటికే బిల్లుల పెండింగ్‌తో ఆర్థిక ఇబ్బందులు
- పెంచిన వేతనం ప్రభుత్వమే చెల్లించాలంటున్న పాలకవర్గాలు



ఇల్లెందు మండలంలోని కొమరారం గ్రామం వ్యూ

ఇల్లెందురూరల్‌: కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామపంచాయతీల్లోని పారిశుద్ధ్య కార్మికుల వేతనాన్ని ప్రభుత్వం పెంచింది. వీరి వేతనాన్ని నెలకు రూ.వెయ్యి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం కార్మికుల్లో ఆనందం నింపినా గ్రామ పంచాయతీలపై మాత్రం భారం మోపినట్లైనని పాలకవర్గాల బాధ్యులు చెబుతున్నారు. ఇప్పటికే పెండింగ్‌ బిల్లులు, నిలిచిన రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులతో సతమతమవుతున్న తాము కేంద్ర నిధులతో ఎలాగోలా పాలన సాగిస్తున్నామని తెలిపారు. ఇంతలోనే ప్రభుత్వం తమపై మళ్లీ భారం మోపిందని పేర్కొంటున్నారు.

అప్పుల భారంతో సర్పంచ్‌లు

గ్రామపంచాయతీలకు గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతినెలా గ్రాంట్లను మంజూరు మంజూరు చేసేవి. ఏడాదికాలంగా అటు కేంద్రం లేదంటే ఇటు రాష్ట్రం నిధుల విడుదలలో జాప్యం చేస్తుండడంతో గ్రామపంచాయతీల్లో ఆర్థిక ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. ప్రాథమిక అవసరాలైన ట్రాక్టర్‌ డీజిల్, పారిశుద్ధ్య పనులు, నిర్వహణ ఖర్చులను సర్పంచ్, కార్యదర్శులు తమ జేబుల్లో నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా పెట్టుబడి కోసం అప్పులు చేసిన సర్పంచ్‌లు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. ఒక్కో సర్పంచ్‌ ఎటులేదన్నా రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు గ్రామపంచాయతీల నిర్వహణకే పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. ఇవేకాక పూర్తయిన అభివృద్ధి పనుల బిల్లులు కూడా రాక అవస్థ పడుతున్నారు.

ఇలా మంజూరు.. అలా చెల్లింపులు

గ్రామపంచాయతీలకు ప్రస్తుతం కేంద్రప్రభుత్వం ద్వారా మాత్రమే ప్రతినెలా నిధులు మంజూరవుతున్నాయి. ఈ నిధులను సిబ్బంది వేతనాలు, ట్రాక్టర్‌ ఈఎంఐ, విద్యుత్తు బిల్లులు, కంప్యూటర్‌ ఆపరేటర్ల వేతనాలకే వెచ్చించాలని నిబంధన విధించారు. దీంతో ఆయా బిల్లులు సమర్పిస్తేనే ఆమోదం పొందుతుండగా.. నిధులు రాగానే చెల్లిస్తుండడంతో మళ్లీ ఖజానా ఖాళీ అవుతోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రావాల్సిన నిధుల్లో జాప్యంతో గ్రామ పంచాయతీల పాలకవర్గాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఇంతలోనే మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల వేతనాన్ని పెంచింది. ఈ నిర్ణయం స్వాగతించాల్సిందే అయినా గ్రామపంచాయతీలపై మాత్రం ఆర్థిక భారమేనని చెబుతున్నారు.

ఖమ్మం జిల్లాలోని 20 మండలాల్లో 589 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటన్నింటిల్లో 2,294మంది కార్మికులు(మల్టీ పర్పస్‌ వర్కర్లు) విధులు నిర్వర్తిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలోని 481 గ్రామపంచాయతీల పరిధిలో 1,557 మంది పనిచేస్తున్నారు. మేజర్‌ పంచాయతీల్లో 10నుంచి 12మంది, చిన్న పంచాయతీల్లోనైతే నలుగురి నుంచి ఆరుగురు విధులు నిర్వర్తిస్తున్నారు. చిన్న పంచాయతీల్లో ఒక్కో కార్మికుడికి నెలకు రూ.8,500, మేజర్‌ పంచాయతీల్లోనైతే రూ.10,500 చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,851మంది కార్మికులు పనిచేస్తుండగా రూ.వెయ్యి చొప్పున వేతనాన్ని పెంచడంతో పంచాయతీలపై రూ.38.51లక్షల మేర అదనం భారం పడనుంది.

పెంచిన వేతనం ప్రభుత్వమే చెల్లించాలి



గ్రామపంచాయతీ కార్మికులకు వేతనం పెంచడం హర్షణీయం. కానీ పంచాయతీల్లో ఆర్థిక వనరులు అంతంత మాత్రంగా ఉండడం, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు చెల్లింపులకే సరిపోతున్నాయి. ఈనేపథ్యాన పెంచిన వేతనాలు చెల్లింపు సాధ్యం కాదు. అందుకే కార్మికుల వేతనాన్ని ప్రభుత్వమే నేరుగా చెల్లించాలి.

– మోకాళ్ల కృష్ణ, సర్పంచ్, మాణిక్యారం, ఇల్లెందు మండలం

అదనపు భారం సరికాదు



రాష్ట్రప్రభుత్వం నుంచి నిధుల మంజూరు కాక.. కేంద్రప్రభుత్వ నిధులు బకాయిలు, వేతనాలకే సరిపోతుండడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాం. మళ్లీ పెంచిన వేతనాల చెల్లింపు భారం జీపీలపై మోపడం సరికాదు. ప్రభుత్వమే ప్రత్యేక గ్రాంట్‌ రూపంలో కార్మికులకు చెల్లించాలి.

– కుంజ కృష్ణ, సర్పంచ్, మామిడిగుండాల, ఇల్లెందు మండలం

రాష్ట్రస్థాయి క్రికెట్‌ పోటీల్లో కేటీపీఎస్‌ సత్తా

పాల్వంచరూరల్‌: పాల్వంచలోని కేటీపీఎస్‌ ఉద్యోగులు క్రీడా పోటీల్లోనూ రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ చూపాలని కేటీపీఎస్‌ ఏడో దశ చీఫ్‌ ఇంజనీర్‌ పి.వెంకటేశ్వరరావు సూచించారు. ఇటీవల భూపాలపల్లిలో టీఎస్‌జెన్‌కో ఆధ్వర్యాన నిర్వహించిన ఇంటర్‌ ప్రాజెక్టు క్రికెట్‌ పోటీల్లో కేటీపీఎస్‌ ప్రతిభ చూపి ద్వితీయస్థానం కైవసం చేసుకుందని తెలిపారు. శుక్రవారం సీఈ జట్టు కెప్టెన్‌ ఎండీ ఆరీఫ్, క్రీడాకారులు, మేనేజర్‌ సతీశ్‌కుమార్, కోచ్‌ కోటేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ యుగపతి, క్రీడా కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, డీఈ శేఖర్, ఏడీఈ వేణుగోపాల్‌ పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ వెంకటేశ్వరరావు

జేపీఎస్‌లది న్యాయమైన పోరాటం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న తమ్మినేని



సంఘీభావం తెలుపుతున్న సాంబశివరావు

చుంచుపల్లి: జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులది న్యాయమైన పోరాటమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌ ఎదుట జేపీఎస్‌లు చేస్తున్న సమ్మె శుక్రవారం ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. జేపీఎస్‌ల సర్వీస్‌ను ఇకనైనా ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రభుత్వ అధికారులకు ఎక్కువ జీతాలు ఇస్తూ దుబారా ఖర్చులు చేస్తున్నారని ఆరోపించారు. జేపీఎస్‌ల సమస్యలపై ఇప్పటికే సీఎం కేసీఆర్‌కు లేఖ రాశానని, త్వరలోనే స్వయంగా కలిసి చర్చిస్తానని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారమయ్యే వరకు జేపీఎస్‌లు ఉద్యమం కొనసాగించాలని, వారికి ఎర్రజెండా అండగా ఉంటుందని తెలిపారు. పార్టీ రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్యతో పాటు అన్నవరపు సత్యనారాయణ, వీరన్న, లిక్కి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే దీక్ష చేస్తాం: కూనంనేని

జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పేస్కేల్‌ ప్రకటించాలని, ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే వారి తరఫున నిరవధిక దీక్ష చేపట్టేందుకైనా వెనుకాడేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. జేపీఎస్‌ల దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ సమస్యపై ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమం కొనసాగించాలని పిలుపునిచ్చారు. నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌ ముగిసినా కార్యదర్శులను రెగ్యులర్‌ చేయకపోవడం సరికాదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, నాయకులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్‌ పాల్గొన్నారు.

ఫార్మసిస్టులకు అవగాహన సదస్సు

నెహ్రూసెంటర్‌: మహబూబాబాద్‌ జిల్లాలోని ఫార్మసిస్టులకు జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం డ్రగ్‌ కంట్రోల్‌ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ అన్ని మందుల దుకాణాల్లో తప్పనిసరిగా ఫార్మసిస్టుల సమక్షంలోనే మందులు విక్రయించాలని సూచించారు. నిషేధిత, మత్తు మందులను డాక్టర్‌ ప్రిస్క్రిప్షన్‌ లేకుండా విక్రయించొద్దని, కొనుగోలుదారులకు తప్పక బిల్లులు ఇవ్వాలని స్పష్టం చేశారు. తొలుత జిల్లాలో పలు షాపుల్లో ఖమ్మం ఏడీ ప్రసాద్‌ ఆధ్వర్యాన డ్రగ్‌ ఇన్‌స్పెక్టర్‌ బి.లక్ష్మి తనిఖీలు చేపట్టారు.



మాట్లాడుతున్న డ్రగ్‌ కంట్రోల్‌ ఏడీ ప్రసాద్‌

బౌద్ధం మతం కాదు... మార్గం

నేలకొండపల్లి: దక్షిణ భారతదేశంలోకెల్లా పెద్దదైన నేలకొండపల్లిలోని బౌద్ధ క్షేత్రం వద్ద శుక్రవారం వైశాఖ బుద్ధ పౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బౌద్ధాచార్య నాగసేన బుద్ధుడి చరిత్రను వివరించారు. అనంతరం మహాసభ చైర్మన్‌ బసవయ్య మాట్లాడుతూ బౌద్ధం మతం కాదని.. ఇది మార్గమని తెలిపారు. బుద్ధుడి మార్గాన్ని అనుసరిస్తూ విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దపాక వెంకట్, కె.సంపత్‌కుమార్, బీఎస్పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అల్లిక వెంకటేశ్వరరావు, పీసీ వీరస్వామితోపాటు శోభన్‌నాయక్, మట్టే గురుమూర్తి, పి.ఆంజనేయులు, సంజీవరావు, పగిడికత్తుల ఈదయ్య, బొడ్డు పటేల్, కట్టికోల వెంకటేశ్వర్లు, వంగూరి ఆనందరావు, పెద్దపాక విజయ్, జగదీశ్‌ పాల్గొన్నారు.



బౌద్ధక్షేత్రం వద్ద పూజలు చేస్తున్న బౌద్ధాచార్యులు, నాయకులు